క్లుప్తంగా

అయోధ్య అక్షింతల శోభాయాత్ర



ఆలయం వద్ద గ్రామస్తులు

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో ఆదివారం అయోధ్య రామయ్య అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో, డప్పువాయిద్యాల నడుమ ఊరేగించి శ్రీ తూర్పు ముఖి హనుమాన్ ఆలయంలో అక్షింతలను భద్రపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందం పటేల్, ఎంపీటీసీ సునంద గిరీష్‌కుమార్, హిందూ వాహిని మండల కన్వీనర్ దిగంబర్‌పటేల్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి మహాసభకు తరలిరావాలి

తానూరు: ముధోల్‌లోని నాగార్జున్‌నగర్‌లో సోమవారం నిర్వహించే భారతీయ బౌద్ధ మహాసభకు సభ్యులు హాజరు కావాలని మహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల బౌద్ధ మహాసభ సభ్యులు హాజరుకావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

భైంసాటౌన్: పట్టణానికి చెందిన చున్నపు సంతోష్ మాతృమూర్తి ఇటీవల మరణించగా ఆదివారం వారి నివాసంలో బాధిత కుటుంబీకులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణ, నాయకులు తోట రాము, రాజన్న, మహేశ్ తదితరులు ఉన్నారు.

చాలీసా పారాయణం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో జనవరి 1న రాములోరి అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీరామ విజయ మహామంత్రాన్ని 108 సార్లు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ట్రస్టు రాష్ట్ర సభ్యులు నారాయణ, భుజంగం గణపతి, నరేందర్, ముత్యం, గజేందర్, హరిప్రసాద్, రమేశ్, గజ్జారాం పాల్గొన్నారు.

లింగాపూర్ ఇన్‌చార్జి కార్యదర్శిగా నరేశ్

కడెం: మండలంలోని లింగాపూర్ ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా నరేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీవో ఉపేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. లింగాపూర్ కార్యదర్శి మౌనిక ప్రసూతి సెలవులపై వెళ్లడంతో.. పాతమద్దిపడగ కార్యదర్శి నరేశ్‌కు లింగాపూర్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీవో పేర్కొన్నారు.

అదుపుతప్పిన బైక్.. ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: బైక్ అదుపుతప్పి కింద పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి గ్రామానికి చెందిన శ్రావణ్(35) తన అత్తగారి ఇల్లు అయిన లక్ష్మణచాంద మండలం చింతల్‌చాంద గ్రామానికి ఉదయం వచ్చారు. రాత్రి 6:30 గంటలకు తిరిగి ఇంటికి వెళ్తుండగా మండలంలోని రాచాపూర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో శ్రావణ్ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే గ్రామస్తులు 108కు సమాచారం ఇచ్చి నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అయ్యప్ప పడిపూజ



పూజలు చేస్తున్న భక్తులు

తానూరు: మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాల ఆవరణలో ఆదివారం అష్ట గురుస్వామి అనిల్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ వేడుకకు ముధోల్, తానూరు, భైంసా, మహారాష్ట్రలోని పలు గ్రామాల అయ్యప్పస్వాములు తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్ప, గణపతి, మణికంఠ స్వామివార్లకు అభిషేకం చేశా రు. గురుస్వాములు అరవింద్‌రెడ్డి, అవినాశ్ ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. పుండలిక్, సంతోశ్, సిద్ధూ పాల్గొన్నారు.

పంటలకు సోలార్ కంచె

- చేన్ల గట్ల చుట్టూ చీరలు, సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకున్న రైతులు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు
- అడవి జంతువుల బెడద తప్పుతుందన్న అన్నదాతలు



హంగిర్గాలో పంట రక్షణకు చేను చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ తీగలు



తానూరులో పెద్దజొన్న పంటకు రక్షణగా చీరలు

తానూరు: వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో రైతులు తమ పంటలను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకుంటున్నారు. వినూత్నంగా ఆలోచిస్తూ పంటల వైపు అడవిపందులు, కోతులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట నష్టం తగ్గడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తానూరు మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, పెద్దజొన్న, శనగ, వేరుశనగ, ఇతర కూరగాయల తోటలను జంతువులు నాశనం చేస్తున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న, పెద్దజొన్న పంటలు ఎదుగుదల దశలో ఉన్నాయి. పంటలను జంతువుల నుంచి కాపాడుకునేందుకు వ్యవసాయాధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ఇవీ పద్ధతులు..

పంటల చుట్టూ కర్రలను పాతి పాత చీరలను గోడల వలే కట్టాలి. అడవిపందులు రాత్రి పంటల వద్దకు వచ్చినప్పుడు చీరల స్పర్శ తగిలి మనుషులు ఉన్నట్లు భ్రమపడి.. భయంతో అరుస్తూ దూరంగా పరుగెత్తుతాయి. క్షౌ రశాలలో వెంట్రుకలను సేకరించి.. పంటల గట్ల చుట్టూ అడుగు మేర వెడల్పు చదును చేసి వెంట్రుకలను పల్చగా చల్లాలని అధికారులు సూచిస్తున్నారు.

రాత్రివేళ శబ్దాలు చేయడం..

అడవి పందుల బెడద ఎక్కగా ఉన్న ప్రాంతాల్లో రైతులు పటాకులు, కేకలు ఖాళీడబ్బాలతో శబ్దాలు చేయాలి క్రూరమృగాల, కుక్కల అరుపులను రికార్డ్ చేసి.. రికార్డింగ్ మైక్ ద్వారా శబ్దం వచ్చేలా రాత్రి చేన్ల వద్ద ఏర్పాట్లు చేయాలి.



బామ్నిలో అవగాహన కల్పిస్తున్న ఏఈవో (ఫైల్)

సోలార్ తీగల ఏర్పాటు..

మరోవైపు గట్ల చుట్టూ సోలార్ తీగలను అమర్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ తీగలు అమరిస్తే మనుషులతోపాటు, జీవాలకు ప్రమాదకరమని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పద్ధతులు పాటిస్తే రాత్రి అంత చేన్ల వద్ద జాగరణ చేయాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

పంట చుట్టూ జీవకంచెలు

వేరుశనగ పంట చుట్టూ 4 నుంచి 5 వరుసల మేర కుసుమ పంటను సాగు చేయాలి. కుసుమ మొక్కలు సన్నని ముళ్ల మాదిరి ఉండి భూమిని తవ్వేందుకు వచ్చే అడవిపందులకు గుచ్చుకుంటాయి. దీంతో తీవ్ర నొప్పి వచ్చి పందులు పంటను తవ్వకుండా వెళ్లిపోతాయి. మొక్కజొన్న పంట చుట్టూ 4 నుంచి 5 వరసలతో ఆముదపు పంట సాగు చేస్తే వాసనకు అడవిజంతువులు పంటల వైపు రావని సూచిస్తున్నారు.

సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకున్నాం



యాసంగిలో మొక్కజొన్న, శ నగ పంటలను సాగు చేస్తున్నాం. అధికారుల సలహాలు పాటిస్తూ అడవి జంతువుల నుంచి రక్షణగా పంటల చుట్టూ సోలార్ కంచెలను ఏర్పాటు చేసుకున్నాం. రాత్రి మైక్‌లు ఏర్పాటు చేసి జంతువుల శబ్దాలు చేస్తున్నాం. దీంతో జంతువులు గట్ల వద్దకు రావడం లేదు.

– సంతోష్, రైతు, ఉమ్రి(కే)

అవగాహన కల్పిస్తున్నాం

మొక్కజొన్న, వేరుశనగ, శనగ, పెద్దజొన్న పంటలను కాపాడుకునేందుకు రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. వారు కూడా మేం చెప్పినట్లు వ్యవహరిస్తున్నారు. విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే జంతువులతోపాటు మనుషుల ప్రాణాలకు నష్టమని చెబుతున్నాం.

– పవన్, వ్యవసాయ విస్తరణాధికారి

'పరువు పోవద్దనే అవిశ్వాసం వద్దన్నాం'

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపాలిటీ పరువు పోతుందనే ఉద్దేశంతో తాము అవిశ్వాస తీర్మానం వద్దన్నామని.. తిమ్మాపూర్, ఖానాపూర్ వీడీసీ అధ్యక్షులు బీసీ రాజన్న, సతీష్‌రావుదేశ్‌పాండే అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన మున్సిపాలిటీలో చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెడితే పట్టణ ప్రతిష్ఠ దెబ్బతినడంతో అభివృద్ధి పనులు నిలిచిపోతాయనే ఉద్దేశంతో తాము ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్‌కు విన్నవించామని పేర్కొన్నారు. కానీ తాము రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నామని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, నాయకులు.. వీడీసీ పెద్దలపై ఎస్పీకి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. మున్సిపాలిటీలో అవినీతి జరిగితే దానికి సభ్యులందరి బాధ్యత ఉండాదా అని ప్రశ్నించారు. అవినీతిపై కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ప్రజల సమక్షంలో చర్చించాలని కోరారు. తాము దాడులు చేస్తామని ఎస్పీకి ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఎస్పీని కలిసి పరిస్థితిని వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కల్వకుంట్ల నారాయణ, ద్యావతి రాజేశ్వర్, కరిపె శ్రీనివాస్, కటికె శ్రీనివాస్, నేతశ్యాం, నారపాక నర్సయ్య, దేవేందర్, మురళి, సత్యనారాయణ, గంగాధర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వీడీసీ సభ్యులు

పచ్చ బంగారానికి తెగులు



ఈ చిత్రంలో కన్పిస్తున్న రైతు పేరు మంద లింగన్న. లోకేశ్వరం మండలం ధర్మోర గ్రామంలో ఎకరం భూమిలో రూ.లక్ష పెట్టుబడి పెట్టి పసుపు పంట సాగు చేశాడు. అధిక వర్షాలతో పంటకు దుంపకుళ్లు తెగులు సోకడంతో 20 గుంటల్లో నష్టం వాటిల్లింది. మందులు పిచికారీ చేసినా దుంపకుళ్లు అదుపులోకి రాలేదు. జిల్లాలో పసుపు సాగు చేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి.



లోకేశ్వరంలో దుంపకుళ్లు సోకిన పసుపు పంట

- ఆందోళనలో జిల్లా రైతాంగం
- అధిక వర్షాలతో దుంపకుళ్లు ఉధృతి
- పెట్టుబడులు వచ్చేలా లేవంటున్న అన్నదాతలు

లోకేశ్వరం: వాణిజ్య పంట అయిన పసుపును జిల్లా ప్రజలు తమ ఇంటి పంటగా భావించి.. ప్రతీ రైతు కొంత విస్తీర్ణంలో సాగు చేస్తుంటాడు. ఇప్పటికే పంటకు సరైన మద్దతు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలకు ఈ ఏడాది తెగుళ్లతో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. భారీ వర్షాలు, మారిన వాతావరణంతో పసుపు పంటకు దుంపకుళ్లు, మర్రిఆకు తెగుళ్లు సోకాయి. రైతులు పురుగు మందులు పిచికారీ చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఈసారి పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని.. వ్యవసాయాధికారులు పంటను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

జిల్లాలో 18 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలో మామడ, సారంగాపూర్, సోన్, లోకేశ్వరం, నిర్మల్, దిలావర్‌పూర్ మండలాల్లో సుమారు 18 వేల ఎకరాల్లో పసుపు పంట సాగు చేశారు. పసుపు పంట విత్తిన తర్వాత రెండు నెలల పాటు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా భూమిలో తేమ శాతం పెరిగి తెగులు సోకింది.

10 వేల ఎకరాల్లో దుంప ముసిగిపోయి..

కొన్ని చోట్ల మొక్కల ఆకులు పచ్చగా ఉండి భూమిలో దుంప ముసిగిపోయింది. మొక్కను చేతితో తీస్తే తేలికగా భూమిలోంచి బయటకు వస్తుంది. పసుపు కొమ్ములు ఊరే ఈ సమయంలో దుంపకుళ్లు సోకడంతో దిగుబడి సగానికి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు 10 వేల ఎకరాల్లో దుంపకుళ్లు సోకినట్లు తెలుస్తోంది. గతేడాది ఎకరాకు 40 క్వింటాళ్ల (25 క్వింటాళ్లు) పసుపు దిగుబడి వస్తే ఈఏడాది కనీసం 20 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు అయ్యాయని.. ప్రభుత్వం తమను ఆదుకోవాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

రెండెకరాల్లో సాగు చేశా



నేను రెండెకరాల్లో పసుపు పంట సాగు చేశా. అధిక వర్షాలతో భూమిలో నీరు నిలిచి పంటకు తెగుళ్లు సోకాయి. దీంతో దిగుబడి సగానికి పడిపోతుందని భయం వేస్తోంది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– ప్రకాష్,నగర్ తండా

వర్షాలు దెబ్బతీశాయి



ఈఏడాది నెల రోజుల పాటు కురిసిన వర్షాలు పసుపు పంటను దెబ్బతీశాయి.నీరు బయటకు వెళ్లలేక పంటలోనే రోజుల తరబడి నిలవడంతో దుంపకుళ్లు, అడుగు రోగం సోకాయి, కనీస దిగుబడి వచ్చేటట్లు లేదు.

– గంజాల గంగాధర్, పంచగుడి

న్యూఇయర్ జోష్



నిర్మల్‌లోని అల్ఫోర్స్ కళాశాలలో..

జిల్లా కేంద్రంలో 2023కు వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్నారులు, యువతీ యువకులు కేక్ కట్ చేసి సందడి చేశారు. డీజే చప్పుళ్లకు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అంతకు ముందు నిర్మల్‌లోని ఆయా ప్రాంతాల్లో బేకరీలు, స్వీట్‌హౌస్‌లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. బేకరీలు, రెస్టారెంట్, హోటళ్ల నిర్వాహకులు ఆఫర్లు పెట్టి వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. డోర్ డెలివరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంచారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యువకుల సందడి



వివేకానంద చౌరస్తాలో ట్రాఫిక్‌జామ్



నిర్మల్‌లోని దివ్యానగర్‌లో..



నిర్మల్‌లోని ఓ హోటల్‌లో..

గట్టుమైసమ్మ ఆలయాభివృద్ధికి కృషి

భైంసాటౌన్: పట్టణంలోని గట్టు మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. ఆదివారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయ అభివృద్ధి కోసం మెట్ల నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతు లు, ఆనందాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. వారి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ బి.గంగాధర్, పలువురు బీజేపీ నాయకులు మల్లేశ్వర్, దత్తాత్రి, పోశెట్టి, కోర్వ చిన్నన్న, పోశెట్టి తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

అమ్మవారి ఆలయాల్లో పూజలు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ గజ్జలమ్మదేవి, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. అర్చకుడు నగేశ్, గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అలంకరణ, అభిషేకం, పల్లకిసేవ చేశారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి నైవేద్యం సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు. కుంటాలకు చెందిన ఉపాధ్యాయుడు మానాజీ గారి సునీత-సిద్ధిరాం, కవిత-లక్ష్మణ్, లహరి-ఆదిత్య అదిర, రమ్యకృష్ణ-చైతన్య దాతలు గజ్జలమ్మ దేవికి రూ.64వేల విలువైన బంగారు కాసుల పేరు బహూకరించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఎస్సై హన్మాండ్లు, హెచ్ఎం సత్రపు గజేందర్, ఆలయ కమిటీ సభ్యులు శంకర్, సుధాకర్, లక్ష్మణ్, శివ, సంజీవ్, రమేశ్ పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సిద్ధమైన శ్రీమల్లికార్జున ఆలయం

- బాబాపూర్‌లో నేటి నుంచి మూడు రోజులపాటు ప్రారంభోత్సవాలు

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున ఆలయం ప్రారంభానికి సిద్ధమైంది. మాజీ మంత్రి ఇంద్రకరణ్ చొరవతో రూ.16లక్షలు మంజూరవగా.. పనులు పూర్తి చేశారు. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల మేర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొట్టు లింగన్న తెలిపారు.

సోమవారం ఉదయం గురువందనం, శాంతిపఠం, పృథ్వీపూజ, కలశపూజ, గౌరీ గణేశ పూజనం, ప్రతిష్ఠ సంకల్పం, పుణ్యాహవచనం, దీక్షా స్వీకరణ, పంచగవ్యమేళనం, యాగశాల ప్రవేశం, బూతశుద్ధి, నవగ్రహాలు, వాస్తు యోగిని, క్షేత్రపాలక సర్వకోభద్ర మండల ఆరాధన, ప్రధాన కలశ స్థాపన, కుండ సంస్కారం, స్థాపిత, దేవత భావన, మూల మంత్ర జపం, జలాధివాసం, మంగళహారతి, మంత్రపుష్పం నిర్వహించనున్నారు.



ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం

రెండో రోజైన మంగళవారం శక్తికలశ స్థాపనం, పంచసూక్త మానవములు, మూలమంత్ర సహిత రుద్ర చండీహోమం, విగ్రహ ప్రతిష్ఠ, ధన్య దీపన, ఫల దీపనం, పుష్పదీపనం, మంగళహారతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం యంత్ర ప్రతిష్ఠ, నక్షత్రం ఉత్తరాషాఢ ఉదయం 8.39 గంటలకు దేవతా ప్రతిష్ఠ, కర్త వ్యసం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మల్లన్న కళ్యాణం, మహాదాశీర్వాదం, అన్నదానం, బ్రాహ్మణ సత్కారం, వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పోలీసుల తనిఖీలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి వెంట పలు కూడళ్ల ఆదివారం రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. డిసెంబర్ 31 సందర్భంగా యువత మద్యం తాగి వాహనాలను నడవద్దని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కల్గించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్సై లింబాద్రి అన్నారు. ప్రశాంత వాతావరణంలోనే కొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

భైంసాటౌన్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా పట్టణంలోని గాంధీగంజ్, బస్టాండ్ ఎదుట ఆదివారం ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప థకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని నాయకులకు సూచించారు. ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, బీజేపీ నాయకులు తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, నాయకులు

అటెన్షన్ ప్లీజ్..

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించేవారికి ముప్పు పొంచి ఉంది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : రాంబాబు, విద్యుత్ ఏఈ,
ఫోన్: 83339 23869



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899